
నక్కజిత్తుల నారా.. గ్యారెంటీ గోవిందా



బాపట్ల: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్డీయే నాయకులు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ తమ ప్రసంగాల్లో సూపర్ సిక్స్ పథకాల గురించి ఊదరగొట్టారు. అధికారంలోకి వస్తే వెంటనే అమలు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో సైతం చిన్న నాయకులు కూడా పథకాలకు సంబంధించిన సమాచారంతో ప్రచారం చేశారు. 'తల్లికి వందనం' కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.15 వేలు, 'అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు, యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదంటే ఉద్యోగం వచ్చే వరకు 'నిరుద్యోగ భృతి' కింద నెలకు రూ.3 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 19–59 ఏళ్ల మహిళకు ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఇస్తామని చెప్పారు. ఆయా పథకాల ద్వారా ఇంత వస్తుంది ... అంత వస్తుందని ఊదరగొట్టారు. ఇంతగా ఆశ పెట్టి వారి చేత ఓట్లు వేయించుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు దాటినా వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. పాఠశాలలు మొదలై మూడు నెలలైనా ఇప్పటివరకు తల్లికి వందనం ఊసే లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు పెట్టుబడి సాయం కింద పైసా రాలేదు. దీంతో వారు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినట్లుగా పక్కాగా పథకాలన్నీ అమలు చేసింది. సమయానికి లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తం జమ అయ్యేలా చూసింది. కూటమి అధికారంలోకి వచ్చాక కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పట్లో సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేమనే వ్యాఖ్యలు చేస్తుండటంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగా అధికారం కోసమే ఇచ్చే ఉత్తుత్తి హామీల జాబితాలో వీటిని చేర్చుతారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికైనా హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

• సూపర్ సిక్స్ హామీల అమలేదీ? • ప్రశ్నిస్తున్న ప్రజలు • తక్షణ అమలుకు డిమాండ్




ప్రతి మహిళకు నెలకు రూ.1,500

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
బాపట్ల	90,300
వేమూరు	55,000
రేపల్లె	1,05,000
నెలకు ఇవ్వాల్సిన సాయం	రూ.37.54 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	బాపట్ల	148.00
	వేమూరు	201.60
	రేపల్లె	106.33



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
బాపట్ల	21,947
వేమూరు	30,000
రేపల్లె	16,493
ఇవ్వాల్సిన సాయం	రూ.256.98 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	బాపట్ల	103.08
	వేమూరు	66.49
	రేపల్లె	86.83



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
బాపట్ల	31,047
వేమూరు	22,000
రేపల్లె	35,600
ఇవ్వాల్సిన సాయం	రూ. 163.65 కోట్లు



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
బాపట్ల	69,000
వేమూరు	43,624
రేపల్లె	18,000
నెలకు ఇవ్వాల్సిన సాయం	రూ.39.18 కోట్లు

'తల్లికి వందనం' ఎప్పుడిస్తారు



టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెప్పింది. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఏటా రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడుస్తున్నా.. ఇంత వరకు పథకం ప్రస్తావనే లేదు. బడులు ప్రారంభమై మూడునెలలైన నేపథ్యంలో తల్లికి వందనం అమలు చేస్తే ఎంతోమందికి మేలు జరుగుతుంది.

–నర్రా శ్రీనివాసరావు (మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం మండలం)

మహిళలకు రూ.1,500 ఊసేది?



ఎన్నికలకు ముందు 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ. 18,000 అందజేస్తామని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ హామీ ఊసెత్తకుండా మభ్యపెట్టాలనుకోవడం సమంజసం కాదు. ఎన్నికల హామీలు సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచి నగదు చెల్లించాలి.

– మార్పూరి నాగజ్యోతి, చిలుమూరు, కొల్లూరు మండలం

గత ప్రభుత్వంలో భరోసా సకాలంలో అందేది



గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా మూడు దఫాలుగా సకాలంలో సాగు కోసం డబ్బులు నేరుగా ఖాతాలలోకి వచ్చేవి. ఈ ఏడాది ముగుస్తున్నా కూటమి ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేల నగదు ఎప్పుడిస్తారో కూడా ప్రకటించలేదు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రైతులకు సాయం అందించాలి.

– అవుతు రఘురామిరెడ్డి , రైతు, వల్లభాపురం

అదునుకు ఆదుకుంటేనే రైతుకు ప్రయోజనం



రైతులకు పంటలు సాగు చేసే అదునుకు ప్రభుత్వం పెట్టుబడి సాయం రూపంలో అందజేసే అన్నదాత సుఖీభవ పథకాన్ని పక్కాగా అమలు చేయాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా జూన్ నెలలోనే పెట్టుబడి సాయం నగదు రైతుల ఖాతాల్లో జమచేసేది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టుగానే ఏడాదికి రూ.20 వేలు రైతులకు అందజేసి ఆదుకోవాలి.

– ముత్తిరెడ్డి వెంకటసుబ్బారావు, రైతు, కిష్కిందపాలెం, కొల్లూరు మండలం

నిరుద్యోగ భృతి ఏమైంది?



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీలలో నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చి వంద రోజులు అయినా దీని అమలు గురించి పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు కల్పించండి లేకపోతే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఖచ్చితంగా ఇచ్చిన హామీ మేరకు ఇవ్వండి. లేకపోతే నిరుద్యోగులను గతంలో మాదిరి మోసి చేసినవారవుతారు. వెంటనే భృతి ఇవ్వండి.

–పొరె ధనుంజయరావు, సంగుపాలెం, పిట్టలవానిపాలెం మండలం

మహిళల అభివృద్ధే లక్ష్యం



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

రేపల్లె రూరల్: మహిళలను అన్ని రంగాలలో ముందుంచటమే మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఎంసీఏ) లక్ష్యమని సంస్థ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని శ్రీగుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో ఎంసీఏ ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన అంకాలజిస్ట్ డాక్టర్ జగదీష్ సహకారంతో ఎలిప్ వారిచే డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు జ్ఞాపకార్థం మహిళలకు నిర్వహిస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ మూడో బ్యాచ్ ఉచిత శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళల కోసం ఎంసీఏ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొంది ఆర్థిక పరిపుష్టిని సాధించాలని చెప్పారు. అనంతరం రెండో బ్యాచ్‌లో శిక్షణ పొందిన 22 మంది మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎలిప్ కో–ఆర్డినేటర్ శోభ, ఎంసీఏ సభ్యులు బాపారావు, రమేష్, సత్యప్రసాద్, సాయిప్రసాద్, ట్రైనర్ దీవిక తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం



దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భట్టిప్రోలు: సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్–తక్కెళ్లపాడు (గుంటూరు) సౌజన్యంతో కరింశెట్టి శ్రీనివాసరావు సహకారంతో బుధవారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ టి.దేవకి, డాక్టర్ ఎం.సృజన, డాక్టర్ కావ్య శ్రావణి, డాక్టర్ ఉజ్వల, 15 మంది దంత వైద్య విద్యార్థులు పాల్గొని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు సమస్య–పరిష్కారం చర్చా వేదిక ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సుగుణ, ఉపాధ్యాయులు వి.సుబ్బారావు, ఎండీ అనూల్‌హుక్, కె.కోటేశ్వరమ్మ, సీతామహాలక్ష్మి, పల్లవి, థెరిసా, రమ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు



కొల్లూరు : వరద బాధిత కుటుంబాలకు గుంటూరుకు చెందిన కార్ఫ్ సంస్థ ప్రతినిధులు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మండలంలోని జువ్వలపాలెంలో బుధవారం సంస్థ ప్రతినిధులు సీహెచ్.శ్రీకర్, శారద ముంపు బాధిత కుటుంబాలకు బియ్యం, కురగాయలు తదితర నిత్యావసర సరకులను అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

ప్రపంచ వెదురు దినోత్సవం



తెనాలి: స్థానిక గెయిటీ థియేటర్ సమీపంలో నివసిస్తున్న మేదర సంఘీయులు బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వెదురుతో తయారుచేసిన చాటలు, గంపలు, విసన కర్రలులను ఒకచోట ఉంచి కుల గురువైన కేతేశ్వరస్వామికి పూలమాల వేసి, కొబ్బరికాయలు కొట్టారు. తమ భక్తి ప్రపత్తులను, తమవృత్తిని గౌరవించుకున్నారు. మేదర సంఘం అధ్యక్షుడు బొరిగె నాగమోహన్, కార్యదర్శి కనికరం రాంబాబు, గౌరవ అధ్యక్షుడు కోడె నాగేశ్వరరావు, కోడె పార్వతి, వీరస్తు రంగారావు, సిరిగిరి కృష్ణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

23న మండల పరిషత్ సమావేశం

రేపల్లె రూరల్: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 23న సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శివపార్వతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

అమర్తలూరు(వేమూరు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరీక్షణ రావు తెలిపారు. అమర్తలూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వెలువోల పేర్నీడి తన భార్య జ్ఞాపకార్థం పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.20 వేలు అందించారు. ఈ మొత్తాన్ని నలుగురు విద్యార్థులకు రూ.ఐదువేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రదానోపాధ్యాయులు మదన మోహనరావు, కొత్తపల్లి భాస్కరరావు, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడాలి

తెనాలిరూరల్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సిబ్బందికి సూచించారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 1, 7, 21 వార్డుల్లో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బందితో శానిటేషన్ పనుల విషయమై తగు సూచనలు చేశారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ సమగ్రంగా జరగాలని, కలెక్షన్ పాయింట్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

పశుగ్రాసం పంపిణీ



కొల్లూరు : వరద ప్రభావిత గ్రామాలలో చీరాల న్యాయవాదులు పశుగ్రాస పంపిణీ చేపట్టారు. తోకలవారిపాలెం, శివారు గ్రామం తురకపాలెంలోని 170 మంది పశుపోషకులకు బుధవారం రూ. 25 వేలు విలువ చేసే పశుగ్రాసాన్ని పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి టి.కృష్ణమోహన్, చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, సీనియర్ న్యాయవాదులు చలపతిరావు, టీజే సాయిబాబు, కామేశ్వరరావు, కె.సుబ్రమణ్యం, జి.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు ప్రజా ప్రతినిధులు

కర్లపాలెం: గ్రామస్తులందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలపై నల్లమోతువారిపాలెంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ పరిశుభ్రత పాటించటం వలన అంటు వ్యాధులను నివారించుకోవచ్చునని చెప్పారు. ఎంపీడీవో ఎలీషాబాబు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావుతో కలిసి ఎంపీడీవో హెల్త్ కార్డులు అందజేశారు.

విశ్వకర్మ జయంత్యుత్సవం



భట్టిప్రోలు: ఏపీ వడ్రంగి అసోసియేషన్ పిలుపు మేరకు భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విశ్వకర్మ జయంత్యుత్సవం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీడీవీ లలిత కుమారి, టి.ఉదయభాస్కరి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర్, సూపరింటెండెంట్ సీహెచ్ జలజ, పంచాయతీరాజ్ ఏఈ శేతు రామచంద్రరరావు, భట్టిప్రోలు పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

55 మందికి ఉపాధి అవకాశం



తెనాలి: స్థానిక జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. దివీస్ లేబరేటరీస్, ఈక్విక్ డైస్ అండ్ మోల్డ్ ఇంజినీర్లు, టాటా స్టైవ్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించారు. హాజరైన 55 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించినట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్/ ప్రిన్సిపాల్ రావి చిన్నవెంకటేశ్వర్లు తెలియజేశారు.

క్లుప్తంగా

పంట నష్టం జాబితా ప్రదర్శన

వేమూరు: వరదలకు పంట నష్ట పోయిన వారి జాబితాలను గ్రామ సచివాలయాల్లో, రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి చందోలు సునీత తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు.

ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ



భట్టిప్రోలు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం బుధవారం మండలంలోని వెల్లటూరు, భట్టిప్రోలు పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో కొనసాగింది. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులకు డీవార్మింగ్(ఆర్‌బెండజోల్) మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు సీహెచ్ రామలక్ష్మి మాత్రల వినియోగంపై అవగాహన కల్పించారు.

పుస్తకాల వితరణ



కొల్లూరు : పోటీ పరీక్షలకు ఉపయోగపడే విజయానికి మార్గదర్శి అనే పుస్తకాలను యాక్ట్ (అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్) వ్యవస్థాపకులు ఆళ్లమూడి ప్రభాకరరావు పాఠశాలలు, శాఖా గ్రంథాలయం, జూనియర్ కళాశాలలకు వితరణగా అందజేశారు. రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ డాక్టర్ అప్పికట్ల భరతభూషణ్ రచించిన పుస్తకాన్ని విద్యార్థి దశ నుంచి చదివితే పోటీ పరీక్షలు, ముఖ్యంగా సివిల్స్‌లో రాణించడానికి అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో పుస్తకాలను వితరణగా ఇస్తున్నట్లు యాక్ట్ వ్యవస్థాపకుడు ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొమ్ము తులామాన్, యాక్ట్ ప్రతినిధులు అత్తోట ప్రమోద్, అలపర్తి బాబు పాల్గొన్నారు.

120 మందికి ఉచిత వైద్యపరీక్షలు



కర్లపాలెం: తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని ఖాజీపాలెం ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ ప్రమీల తెలిపారు. బుధవారం కర్లపాలెం సత్యసాయి గ్రామీణ సేవా సమితిలో ప్రముఖ సమాజ సేవకులు ఆలపాటి రమణారావు సహకారంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ ప్రమీల సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి గ్రామీణ సేవా సమితి సభ్యులు టి.శ్రీనివాసరావు, ఆలపాటి రమణారావు, జిడుగు వెంకటేశ్వర్లు, సోమరౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



చుండూరు(వేమూరు): ప్రజలు ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కె.సురేష్ హెచ్చరించారు. చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామస్తులకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. అనుమతి లేని నిర్వాహకుల వద్ద చీటిపాటలు వేయరాదని, అధిక వడ్డీలు ఆశ చూపితే డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. రుణ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకోరాదని హెచ్చరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరు చెప్పినా నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామయ్య, హెడ్ కానిస్టేబుల్ చంద్రరావు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



బాపట్ల: మహిళలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ లక్ష్మీ పార్వతి పేర్కొన్నారు. పట్టణంలోని 30వ వార్డు ఇస్లాంపేట, కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషకాహార మాసోత్సవంలో సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశనలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సయ్యద్ కరీమున్నీసా నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పోషకాహారం తీసుకుంటే రక్తహీనత దూరమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.